సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 21 । డిసెంబర్ । 2024



కొండల్ని పిండేస్తున్నారు

కేవీపల్లె మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీలో ఎలాంటి అనుమతులు లేకపోయినా మైనింగ్ మాఫియా కొండల్ని పిండి చేస్తూ సొమ్ము చేసుకుంటోంది.

-8లో



ఐదుగురు స్మగ్లర్లు అరెస్టు

పుల్లంపేట పోలీసుస్టేషన్ పరిధిలో అనంత సముద్రం పంచాయతీ బోటుమీదపల్లెకు చెందిన ఐదుగురుఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.220
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 135 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	542	542
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 68.580 కిలోలు

న్యూస్‌రీల్

నిధులు విడుదల

మదనపల్లె సిటీ: ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ మెటీరియల్ కొనుగోలుకు నిధులు విడుదల చేసినట్లు జిల్లా స్కూల్ అసిస్టెంట్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కన్వీనర్ నరేష్‌బాబు తెలిపారు. ప్రైమరీ స్కూల్‌కు రూ.7 వేలు, అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు రూ.14,000, హైస్కూల్‌కు రూ.30,000 స్పోర్ట్స్ మెటీరియల్ కోసం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.నిధులతో స్పోర్ట్స్ మెటీరియల్ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్): జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి డ్రిప్ పైపుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారిణి వనితభాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రైతులు పండ్ల తోటలు ఎక్కువగా సాగు చేస్తూ ఉంటారని తెలిపారు. డ్రిప్ పథకాన్ని పొంది ఏడు సంవత్సరాలు పూర్తయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తుంపర సేద్యం (స్ప్రింకర్లు) పరికరాలు పొందవచ్చని ఆమె తెలియజేశారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

రాయచోటి (జగదాంబసెంటర్): జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి కొత్తగా ప్రైవేట్ ప్రాథమిక అప్పర్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల ఏర్పాటు, వాటి అప్‌గ్రేడేషన్ కోసం ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తేదీల తర్వాత అందిన దరఖాస్తులు స్వీకరించబోమన్నారు.పాఠశాల ఏర్పాటు చేసే ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య, అప్పటికే కొనసాగుతున్న పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను బట్టి అనుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. 2025-26 సంవత్సరానికి జనవరి 26, 2025లోపు కొత్త పాఠశాలల అనుమతులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఏదైనా తరగతి అప్‌గ్రేడేషన్ చేయడానికి కూడా ఈ నెల 31లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. అనుమతి ప్రక్రియలో భాగంగా పరిశీలన అధికారులు ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి జెటిఫికేషన్ రిపోర్టు సమర్పించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలి

రాయచోటి (జగదాంబసెంటర్): ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపేలా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు.శుక్రవారం జరిగిన శిక్షణలో జిల్లా వ్యవసాయాధికారి పాల్గొని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ఉన్న బీడు భూములు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, మోడల్స్‌పై సమీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, జిల్లా ప్రకృతి వ్యవసాయ పథక మేనేజర్ ప్రవీణ్, డీపీఎంయు సిబ్బంది, 30 మండలాల నుంచి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైవీయూలో ఇండక్షన్ ప్రోగ్రామ్

వైవీయూ: యోగివేమన విశ్వ విద్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, విశిష్ట అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, గౌరవ అతిథులుగా రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ హాజరవుతున్నారని తెలిపారు.

డోర్‌డెలివరీ మాసోత్సవాలను జయప్రదం చేయాలి



లక్ష్మిడెంటల్ క్లినిక్ నిర్వాహకులకు పార్శిల్ అందిస్తున్న రవాణాధికారి రాము

రాయచోటి అర్బన్: ఆర్టీసీ డోర్‌డెలివరీ ప్రచార మాసోత్సవాలను జయప్రదం చేయాలని సంస్థ జిల్లా రవాణాధికారి రాము పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని లక్ష్మిడెంటల్ క్లినిక్ వారికి పార్శిల్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 20 నుంచి జనవరి 19వ తేదీ వరకు ప్రచారం మాసోత్సవాలు జరుగుతాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు డోర్‌డెలివరీ ప్రచార మాసోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ప్రజలు సైతం తమ బంధు,మిత్రులకు కార్గో డెలివరీ గురించి తెలియజేసి ఆర్టీసీ ఆదాయం పెంపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎం ధనుంజయ పాల్గొన్నారు.

దార్శనిక నేత.. విద్యా ప్రదాత

- వైఎస్ జగన్ హయాంలో రూపుమారిన విద్యా వ్యవస్థ
- ప్రతి ఏటా డిసెంబరు 21న 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ
- అమ్మ ఒడి మొదలుకొని గోరుముద్ద వరకు సకాలంలో అందజేత
- టెక్నాలజీ అందిపుచ్చుకునేలా చదువుకు ట్యాబులతో భరోసా
- కూటమి సర్కార్‌లో అంతంత మాత్రంగా విద్యార్థుల సంక్షేమం



బైజూస్ ట్యాబ్‌లతో విద్యార్థులు(ఫైల్)

సాక్షి రాయచోటి: సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా బాలల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్న మహోన్నత ఆశయంతో జగన్ సర్కార్ అడుగులు వేసింది. కంప్యూటర్ యుగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటూ...ఇతర దేశాల్లో కూడా మన విద్యార్థులు తలెత్తుకుని గర్వంగా నిలబడాలని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించారు. ఇంగ్లీషు చదువుతోపాటు.. వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా బైజూస్‌ను తీసుకొచ్చారు. నేటి బాలలే రేపటి పౌరులు...వారు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని నమ్మిన వైఎస్సార్‌సీపీ సర్కార్ వారి సంక్షేమంకోసం పూర్తి స్థాయిలో మార్పులు తీసుకొచ్చింది. ఒకటేమిటి...చదివే పాఠశాల మొదలుకొని..చదువుకు అవసరమైన సొమ్ములను జగనన్న అమ్మ ఒడి ద్వారా అందించడం...సకాలంలో జగనన్న కానుక ద్వారా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే తొమ్మిది వస్తువులను అందించి చరిత్ర సృష్టించారు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, ట్యాబుల అందజేతతో వైఎస్ జగన్ సర్కార్ ఒక చరిత్రను తిరగరాసింది. ప్రభుత్వ బడుల్లో చదివే వారు పదోతరగతిలో అధిక మార్కులు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎనలేని కృషి చేసింది. అంతేకాకుండా ప్రతి ఏడాది డిసెంబరు 21న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న పరిస్థితిని ప్రస్తుత విద్యార్థులు గుర్తు చేసుకుంటున్నారు.



టెక్నాలజీ అందిపుచ్చుకునేలా ట్యాబ్‌ల పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకునేలా.. సాంకేతికతలో దూసుకుపోయేలా ట్యాబుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అన్నమయ్య జిల్లాలో 8వ తరగతి విద్యార్థులకు డిసెంబరు 21న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా అందిస్తూ వచ్చారు. రెండు విడతల్లో సుమారు 31 వేల ట్యాబ్‌లను పంపిణీ చేయగా, 30 వేలమందికి వెయ్యి ట్యాబులు ఉపాధ్యాయులకు అందజేశారు. మరోవైపు పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి శ్రీకారం చుట్టి చిన్నప్పటి నుంచే ఇంగ్లీషులో చిన్నారులు పట్టు సాధించేలా అప్పటి ప్రభుత్వం ఆలోచన చేసింది. కార్పొరేట్‌కు దీటుగా ఈ తరహా ఇంగ్లీషు విధానానికి శ్రీకారం చుట్టి చరిత్ర సృష్టించింది. ఇలాంటి మంచి పనులు చేసినా అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ట్యాబ్‌లు చూడడం ద్వారా విద్యార్థులు చెడిపోతారని, ఆంగ్ల మాధ్యమం వద్దంటూ రాద్ధాంతం చేయడం పట్ల అప్పట్లో ప్రజల్లో నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది.

అమ్మ ఒడితో భరోసా

పేదరికంలో మగ్గుతూ..ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సంబంధించి ప్రోత్సాహకంగా జగనన్న అమ్మఒడి పథకాన్ని తీసుకొచ్చారు. ప్రత్యేకంగా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఒక్కొక్క విద్యార్థికి రూ.15 వేలు చొప్పున అందించేవారు. ఇలా వరుసగా నాలుగేళ్లపాటు అమ్మఒడి ద్వారా విద్యార్థిలో భరోసా నింపారు. ప్రతి ఏడాది జిల్లాలో 1.57 లక్షల మందికి రూ. 231 కోట్లకు పైగా నిధులు అందిస్తూ వచ్చారు. ప్రతి ఏడాది రూ.229 నుంచి 231 కోట్ల మధ్య అర్హులకు అందజేస్తూ రావడం చరిత్రలో నిలిచిపోయింది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చినా..ఎన్నికల్లో హామీ ఇచ్చినా ఇప్పటికీ తల్లికి వందనం పథకానికి రూపకల్పన చేయలేదు.


నాడు-నేడుతో రూపురేఖలు మారిన పాఠశాలలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. ఒకనాడు అధ్వానంగా ఉన్న పరిస్థితుల నుంచి పూర్తిగా కొత్త హంగులతో..అధునాతన సౌకర్యాలతో దర్శనమిస్తున్నాయి. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి విడతగా సుమారు రూ. 157.28 కోట్లతో 593 ప్రభుత్వ పాఠశాలల రూపుమార్చారు. రెండో విడతలోనూ రూ. 150.69కోట్ల వ్యయంతో 994 ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు కింద ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టారు. ఇలా ఎక్కడ చూసినా నాడు-నేడుతో చేపట్టిన పనులతో పలు పాఠశాలలు నేటికీ జగన్ సర్కార్‌ను గుర్తు చేసుకునేలా కనిపిస్తున్నాయి.




అందంగా రూపుదిద్దుకున్న రెడ్డివారిపల్లె పాఠశాల

విద్యార్థుల చదువుకు 'నేనున్నానని'....



వైఎస్ జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి విద్యార్థుల సంక్షేమంతోపాటు చదువుకు పెద్దపీట వేసింది. ప్రధానంగా జగనన్న వసతి దీవెన ద్వారా సుమారు 1.05 లక్షల మంది విద్యార్థులకు ఏడాదికి రూ. 122 కోట్లచొప్పున అందించగా, విద్యా దీవెన ద్వారా 94,434 మంది విద్యార్థులకు రూ. 305 కోట్లు చొప్పున వెచ్చించారు. ఇలా నాలుగేళ్లపాటు అందజేస్తూ వచ్చారు. 1043 పాఠశాలల్లో 1-10 తరగతుల విద్యార్థులకు సంబంధించి 1,57,292 మంది విద్యార్థులకు గోరుముద్ద ద్వారా రాగిజావ, అరటిపండు, కోడిగుడ్డు, చిక్కీలు తదితర పౌష్టికాహారాన్ని అందిస్తూ ప్రత్యేకత చాటుకున్నారు. అలాగే విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే ప్రతి ఏడాది 1.55 నుంచి రూ. 1.63 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా తొమ్మిది రకాల వస్తువులను అందజేస్తూ వచ్చారు. అంతేకాకుండా జగనన్న విదేశీ విద్య కింద కూడా ప్రతి ఏడాది రూ. 10-20 కోట్లు ఖర్చుచేస్తూ పలువురు విద్యార్థులకు తోడ్పాటు అందించారు.

కూటమి సర్కారులో విద్యార్థులకు సం'క్షామం'



ఎన్నో ఆశలు...మరెన్నో ఆకాంక్షలు...ఇంకెన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి సర్కార్ అమలు దిశగా అడుగులు వేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ఇప్పటివరకు విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేసిన దాఖలాలు లేవు. ప్రధానంగా ఇప్పటికీ తల్లికి వందనం అమలుకు సంబంధించి కనీసం విధి విదానాలు అమలు చేయకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. పాఠశాలల ఆధునీకరణకు నాడు-నేడు లాంటి స్కీములు గురించి కనీస ఆలోచన కూడా చేయకపోవడం ఆందోళన కలిగించే పరిణామం. జగన్ సర్కార్ అమలు చేసిన పథకాలకే పేర్లు మార్చి వాటిని అరకొరగా అమలు చేస్తున్నారే తప్ప పూర్తి స్థాయిలో అందించకపోవడం దారుణం. విదేశీ విద్యకు ఇంకా శ్రీకారం చుట్టకపోవడం....విద్యా కానుక లాంటి పథకాలు సరిగా అమలు కాక నీరుగారి పోవడం పట్ల ప్రజల్లో చర్చకు దారి తీస్తోంది. ఏది ఏమైనా కూటమి సర్కార్ ట్యాబ్‌లు లాంటివి అందించకపోవడం చూస్తే ప్రభుత్వానికి పేద విద్యార్థుల పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది.

నాడు-నేడుతో అన్ని సౌకర్యాలు



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మా స్కూల్‌లో అన్ని సౌకర్యాలు కల్పించారు. నాడు-నేడు వల్ల మా పాఠశాల ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఉండేది. జగన్ సీఎంగా ఉన్నప్పుడు పుస్తకాలు, యూనిఫాం, షూ, బ్యాగు, బెల్టు అన్ని ఫ్రీగా ఇచ్చారు. మాలాంటి పేదోళ్లకు జగనన్న అనేక పథకాలు పెట్టి మేలు చేశాడు.

– నాగవల్లవి, తొమ్మిదో తరగతి, ప్రభుత్వహైస్కూల్, రాజంపేట

ఫీజు కట్టలేకున్నాం



నాకు ఇద్దరు పిల్లలు. మదనపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6, 9 తరగతులు చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పారు. స్కూళ్లు తెరిచి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి రూపాయి కూడా అందలేదు. పిల్లలు ఫీజులు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాం.

-జమ్‌రుత్‌బాషా, సీటీఎం(మదనపల్లె)

గత విద్యా విధానాలను కొనసాగించాలి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అందించిన ట్యాబ్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయి. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో విద్య పరంగా అమలు చేసిన పథకాలను కొనసాగించాలి. అలాగే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందచేసి వారి అభివృద్ధికి కృషి చేయాలి. విద్యార్థులను పాఠశాలలకు పంపేందుకు ప్రోత్సహిస్తూ ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకాన్ని కొనసాగించాలి.

– ఎం.నర్సింహారెడ్డి, హెచ్ఎం, సంబేపల్లె జెడ్పీ హైస్కూల్

ప్రభుత్వబడులను అభివృద్ధి చేసిన ఘనత జగనన్నదే



రాష్ట్రంలో ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. పిల్లలకు నాణ్యమైన విద్య, మంచి భోజనం, భద్రత కల్పించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. గతంలో, భవిష్యత్తులో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేదలకు విద్యను అందించడంలో ఆయన సఫలీకృతులయ్యారు.

–డీవీ రమణ, రైల్వేకోడూరు

ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలి

- జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లాలో ప్రణాళికాబద్ధంగా ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లాలో ఇళ్ల నిర్మాణ ప్రగతి, 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, వ్యక్తిగత మరుగుదొడ్ల జియో టాగింగ్ అంశాలకు సంబంధించి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ డీఈ, ఏఈ, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డీఆర్డీఏ ఏపీఎం, డ్వామా ఏపీఓ, పంచాయతీ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. విధుల పట్ల బాధ్యతారహితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

- జిల్లాలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్, డీఆర్‌డీఏ, డ్వామా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే గృహ నిర్మాణంలో ప్రగతి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో హౌసింగ్, డీఆర్‌డీఏ పీడీలు శివయ్య, సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ డీఈ, ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏపీఎం, ఏపీఓ, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

పిట్టకొంచెం...జ్ఞాపకం ఘనం

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అవార్డును సొంతం చేసుకున్న రాజంపేట చిన్నారి

రాజంపేట టౌన్: అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణం ముకుందార్‌గడ్డకు చెందిన షేక్ మహమ్మద్ మిస్‌బాహ్ సిద్దిక్ వయస్సులో నెలల చిన్నారి. అయితే జ్ఞాపకశక్తికి వయస్సుతో సంబంధంలేదని నిరూపించాడు. ప్రస్తుతం మహమ్మద్ వయస్సు 19 నెలలు మాత్రమే. అయితే 18 నెలల వయస్సులోనే ఇండియాబుక్ ఆఫ్ రికార్డు అవార్డును సొంతం చేసుకున్నాడు. కాగా మహమ్మద్ తండ్రి షేక్ ముజీబ్ ఓబులవారిపల్లెలో వీఆర్‌ఓగా పనిచేస్తుండగా తల్లి షేక్ మసూద బేగం రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాల సచివాలయంలో అమినిటి సెక్రటరీగా పనిచేస్తోంది. మహమ్మద్ పుట్టినప్పటి నుంచి చురుకుదనంతో ఉండటంతో తల్లి ఫ్లాష్ కార్డులు తెప్పించి వివిధ రకాల వస్తువులు, పండ్లు, వాహనాలు, జంతువులు, స్వాతంత్ర్య సమరయోధులు, మనిషి శరీరంలోని అవయవాలను చూపించి వాటి గురించి చెపుతూ వచ్చింది. దీంతో మహమ్మద్ దాదాపు 360 రకాల చిత్రాలను ఇట్టే గుర్తుపట్టేస్తున్నాడు. ఆ చిన్నారి ముందు ఫ్లాష్‌కార్డులోని చిత్రాలు ఉంచి అందులో ఏదేని ఒకపేరు చెప్పి ఎక్కడ ఉందో చూపించమని చెప్పగానే ఆ చిత్రం వద్ద వేలుపెట్టి చూపిస్తుండటం విశేషం. ఇదిలావుంటే ఎవరు చేయలేని దానిని చేస్తే ఇండియా బుక్ ఆఫ్ రికార్డు వారు అవార్డును ప్రధానం చేస్తారు. అందువల్ల మహమ్మద్ తల్లిదండ్రులు మహమ్మద్ ప్రతిభను వీడియో తీసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు పంపారు. దీనిని ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సంస్థ ప్రతినిధులు పరిశీలించి బయటి వ్యక్తులతో వీడియో చేసి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. దీంతో మహమ్మద్ తల్లిదండ్రులు బయటి వ్యక్తులతో ఆ చిన్నారి ప్రతిభను వీడియో చేసి ఈ ఏడాది నవంబర్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు పంపారు. వీడియోను పరిశీలించిన సంస్థ ప్రతినిధులు నవంబర్ 30వ తేదీ మహమ్మద్‌ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికచేశారు. ఇంత వరకు 18 నెలల చిన్నారులు ఎవరు కూడా ఇలాంటి ప్రతిభను కనబరచనందున మహమ్మద్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికయ్యారు. అవార్డును ప్రధానం చేసేందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సంస్థ ప్రతినిధులు మహమ్మద్ తల్లిదండ్రులను హరియాణకు రావాల్సిందిగా ఆహ్వానించగా అంతదూరం రాలేవన్నారు. దీంతో వారు ప్రశంసాపత్రం, గుర్తింపు కార్డును కొరియర్ ద్వారా పంపగా ఈనెల 16వ తేదీ ఎఅందుకున్నారు. ఈవిషయాన్ని మహమ్మద్ తల్లిదండ్రులు శుక్రవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు.



తల్లిదండ్రులతో మహమ్మద్

అసలేం జరిగింది?

ఉన్నతాధికారుల ఆరా..

- 'వైద్య ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అక్కడ పనిచేసే సిబ్బంది బోగస్ సర్టిఫికెట్స్ ద్వారా అనర్హులకు ఉద్యోగాలు కల్పించారనే అంశంపై సాక్షిలో శుక్రవారం 'వైద్య ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు స్పందించారు. సమాచారం మేరకు కథనంలో వచ్చిన అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. విజిలెన్స్ అధికారులు సైతం ఈ అంశంపై దృష్టి సారించారు. ఆరోపణలను ఎదుర్కొంటున్న ఉద్యోగుల వివరాలను వాకబు చేశారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి...

ఈ శాఖలో అవినీతి అక్రమాలపై పలు దశల్లో పెద్ద ఎత్తునే ఆరోపణలు వచ్చాయి. అక్కడ పనిచేసే కొంత మంది ఉద్యోగుల వైఖరిపై ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బోగస్ సర్టిఫికెట్స్ వ్యవహారం తరహా వెలుగు చూస్తూనే ఉంది. అయితే బోగస్ సర్టిఫికెట్స్ నిర్ధారణకు అధికారులు సంబంధిత యూనివర్శిటీకి పంపడం..అక్కడి నుంచి వచ్చే నివేదిక ప్రకారం ఉద్యోగంలో ఉంచడమా లేక తొలగించడమా ఏదో ఒకటి చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో అసలు దొంగలు..వాస్తవాలు మరుగున పడిపోతున్నాయి. అసలు బోగస్ సర్టిఫికెట్స్‌ను ఎవరు తయారు చేస్తున్నారు. అనర్హులకు ఉద్యోగాలు వచ్చేలా వ్యవహారంను ఎలా నడుపుతున్నారు. ఇదంతా చేస్తోంది ఇంటి దొంగలా లేదా బయట ఏదైనా ముఠా ఉందా అనే అంశాలపై ఎందుకు దృష్టి సారించడం లేదు అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. బోగస్ సర్టిఫికెట్స్ అంశం వచ్చిందంటే చాలు అధికారులు మొదట చెప్పే మాట యూనివర్శిటీకి పంపిస్తాం..చర్యలు తీసుకుంటాం అని. సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం చూడరెందుకని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను అక్కడే ఉంచడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉద్యోగ ధర్మం పాటించాలి. అర్హులకు న్యాయం చేయాలి. అందుకోసం ప్రభుత్వం జీతాలు ఇస్తోంది. 'మేము నిజాయతీపరులం' అని సమర్థించుకుంటూ అడ్డదారుల్లో వెళ్లడం తగునా. నిస్పక్షపాతంగా విచారణ జరిపితే వచ్చిన ఆరోపణలు నిజమా లేక అబద్ధమా అనేది తేలుతుంది. ఆరోపణల్లో వాస్తవాలు లేవంటే నిర్దోషులుగా తేలుతారు, లేదంటే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, నిరుద్యోగులు అంటున్నారు.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

సర్టిఫికెట్స్‌ను యూనివర్శిటీకి పంపాం

బోగస్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగాలు పొందిన కొందరిపై ఆరోపణలు వచ్చాయి. నిర్ధారణ కోసం ఆయా యూనివర్శిటీలకు సర్టిఫికెట్స్ పంపామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. యూనివర్శిటీ నుంచి నివేదిక రాగానే సంబంధిత ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

32 మంది మెడికల్ కాలేజీ సిబ్బంది బదిలీ

మదనపల్లె: మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి(మెడికల్ కాలేజీ)కి సంబంధించిన 32 మంది సిబ్బందికి బదిలీ ఉత్తర్వులు వచ్చినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శివరామకృష్ణ తెలిపారు. నాన్ క్లినికల్ (మెడికల్ కాలేజీ బోధనా సిబ్బంది) సిబ్బంది 26 మంది, క్లినికల్ సిబ్బంది 6 మంది కౌన్సెలింగ్ ద్వారా బదిలీ స్థానాలను ఎంచుకోగా, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. వీరిలో నాన్ క్లినికల్ సిబ్బందిని శుక్రవారం విధుల నుంచి రిలీవ్ చేశామన్నారు.ఆరుగురు క్లినికల్ వైద్యుల స్థానాల్లో బదిలీపై ఇతరులు వచ్చి విధుల్లో చేరేంతవరకు ప్రస్తుతం విధుల్లో ఉన్న వైద్యులను కొనసాగించనున్నట్లు తెలిపారు. బదిలీ అయిన వైద్యుల జాబితాలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శివరామకృష్ణ ఉన్నారు. కాగా మదనపల్లె మెడికల్ కాలేజీ లో 2023-2024 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు 262 మందికి క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పోస్టులు మంజూరు చేసింది. 60 మందికి పైగా వైద్య సిబ్బంది మదనపల్లి మెడికల్ కాలేజీలు పనిచేయడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు.2024 జూన్ నెలలో మదనపల్లె మెడికల్ కాలేజీని పరిశీలించిన ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కమిషన్) మెడికల్ కాలేజీలో తరగతులు ప్రారంభించేందుకు అనుమతి లభించలేదు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు సమకూర్చలేదన్న కారణం చూపుతూ ఎన్ఎంసీ అనుమతులు నిరాకరించింది.

క్లుప్తంగా

ఇద్దరు మహిళల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యయత్నానికి పాల్పడి మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. కురబలకోట మండలం జబ్బావారి పల్లెకు చెందిన నరసింహులు భార్య పాపులమ్మ(40) కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది ఇంటి వద్దనే, పెయింట్స్‌లో కలిపే టర్పెంట్ ఆయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బి కొత్తకోట మండలం తంగా వారి పల్లెకు చెందిన ప్రకాష్ రెడ్డి భార్య సబిత (28) కడుపునొప్పి భరించలేక టమాట పంటకు వాడే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో గమనించిన వారి కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే 108 అంబులెన్స్‌లో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

రామసముద్రం : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగయ్య తెలిపారు. చెంబకూరు పంచాయతీ కమతంపల్లెకు చెందిన శ్రీనివాసులు, చెంబకూరుకు చెందిన రవిలు కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు తమ సిబ్బంది దాడి, సోదాలు చేయగా ఒకొక్కరి నుంచి 90 ఎంఎల్ ప్యాకెట్లు 25 చొప్పున 50 లభించినట్లు తెలిపారు. వారి నుంచి మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

బైకును ఢీకొన్న కారు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని ఒంటిమిట్ట చెరువుకట్టపై శుక్రవారం బైకును కారు ఢీకొంది. స్థానికుల వివరాల మేరకు.. ఒంగోలుకు చెందిన టిఎస్ 08 హెచ్‌జెడ్1511 నెంబరు గల వీఎస్ పణీంద్రకుమార్ కారు కడప వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకొన్న ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని ప్రైవేటు అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీ
– ఇద్దరికి గాయాలు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె వద్ద శుక్రవారం ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. వివరాలిలా..గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీకి చెందిన టి. గణేష్, అతని స్నేహితుడు కుమార్ ద్విచక్రవాహనంపై రాయచోటికి బయలుదేరారు. మార్గమధ్యంలో సూరప్పగారిపల్లెకు సమీపంలోని ఓ మలుపు వద్ద ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొంది. వేకువజామునే పొగమంచు ఉండడంతో పాటు మలుపు దగ్గర హఠాత్తుగా ట్రాక్టర్ రోడ్డుపైకి రావడంతో ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గణేష్, కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

కొండల్ని పిండేస్తున్నారు..!

- వద్దు బాబోయ్ క్వారీలు అంటున్న సమీప గ్రామస్తులు
- తీతవగుంటపల్లెలో ఇష్టానుసారంగా క్వారీల నిర్వహణ
- అడవిపల్లె రిజర్వాయర్‌కు పొంచివున్న ప్రమాదం
- అనుమతులు లేకపోయినా ఇష్టారాజ్యంగా క్వారీలు




తీతవగుంటపల్లె వద్ద నిర్వహిస్తున్న క్వారీలు (ఇన్‌సెట్) పేలుడుకు ఉపయోగించే పరికరాలు

పీలేరు/కేవీపల్లె : ఎలాంటి అనుమతులు లేకపోయినా మైనింగ్ మాఫియా కొండల్ని పిండిచేస్తూ సొమ్ము చేసుకుంటోంది. కేవీపల్లె మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీలో ఎలాంటి అనుమతి లేకుండా క్వారీలు నిర్వహిస్తుండడంతో శబ్దాలతో భరించలేకున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాల సమీపంలో క్వారీలు వద్దు బాబోయ్... క్వారీలు వద్దు అంటూ సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తీతవగుంటపల్లె సమీపంలో ఉన్న కొండ ప్రాంతంలో క్వారీ నిర్వాహకులు రాళ్లను పేలుడు పదార్థాలతో పేల్చుతున్నారు. బయటప్రాంతాల నుంచి కూలీలను తెప్పించి అక్కడే అవాసం కల్పించారు. రాళ్లను ముళ్లకూసాలు, కట్రాళ్లు కొట్టి సొమ్ముచేసుకుంటున్నారు. పంచాయతీ పరిధిలోని తీతవగుంటపల్లె, హరిజనవాడ, కురవపల్లె, అంధ్రావారిపల్లె, ఎగువకురవపల్లె గ్రామాలు పేలుళ్ల శబ్దాలతో దద్దరిల్లుతున్నాయి. గ్రామాలకు అతి సమీపంలో పేలుడు పదార్థాలతో పెద్ద శబ్దాలతో ఇష్టానుసారం రాళ్లను పేల్చుతుండడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాల వద్దకు పంటలు సాగు చేయడానికి వెళ్లలన్నా, పశువులు మేపుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. ప్రాణాలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని భయం గుప్పిట్లో కాలం వెలదీయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడవిపల్లె రిజర్వాయర్‌కు నీరు వస్తే..

కొండప్రాంతాన్ని ఆధారం చేసుకుని అడవిపల్లె రిజర్వాయర్‌ను నిర్మించారు. అయితే క్వారీలతో కొండలోని రాళ్లు కొట్టుతుండడంతో రిజర్వాయర్ ఓ వైపు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. రిజర్వాయర్‌కు నీరు వస్తే పక్కనే ఉన్న సుమారు 600 ఎకరాల పొలాలకు నష్టం వాటిల్లుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రిజర్వాయర్ కట్ట దెబ్బతింటే తీతవగుంటపల్లె, కేవీపల్లె గ్రామ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాలకు ప్రమాదం పొంచివుందని, గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని చెబుతున్నారు. అక్రమ క్వారీలపై తహసీల్దార్ క్రాంతి కుమార్‌ను వివరణ కోరగా క్వారీలకు తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

కేవీపల్లె మండలంలో మైనింగ్ మాఫియాపై ఈ నెల 16న జిల్లా కలెక్టర్‌కు సీపీఐ నాయకులు ఫిర్యాదు చేశారు. అడవిపల్లె ప్రాజెక్టు సమీపంలో కొండలలో అక్రమంగా తమిళనాడు కూలీలచే మైనింగ్ చేపిస్తున్న మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరారు. రూ. 2వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో అడవిపల్లె ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రాజెక్టు సమీపంలో పేలుళ్లు చేపడుతుండడంతో ప్రాజెక్టు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకుని ప్రాజెక్టును కాపాడాలని కోరారు.

మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి



ఎలాంటి అనుమతులు లేకపోయినా మైనింగ్ మాఫియా అక్రమంగా క్వారీలు నిర్వహిస్తున్నారు. కొన్ని ఏళ్లుగా కొండల్ని పిండి చేసి సొమ్ము చేసకుంటున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి అక్రమ క్వారీల నిర్వాహకులపై చర్యలు తీసుకుని మైనింగ్ మాఫీయాకు అడ్డుకట్ట వేయాలి.

– టి.ఎల్. వెంకటేష్, సీపీఐ నాయకుడు

భయపడుతూ బతికే పరిస్థితి



ప్రజలకు ఇబ్బంది కల్గిస్తూ క్వారీలు నిర్వహిస్తున్నారు. పేలుడు పదార్థాలతో రాళ్లను పేల్చుతుండడంతో రాళ్లు ఎగిరిపడుతుంటాయి. సమీప గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెలదీస్తున్నారు. రాళ్లు ఎప్పుడు నెత్తిన పడుతాయోనని పశువుల కాపర్లు భయం భయంగా జీవనం సాగిస్తున్నారు.

– రెడ్డిబాలాజీ, తీతవగుంటపల్లె, కేవీపల్లె

అడవిపల్లె రిజర్వాయర్‌కు ప్రమాదం



ఈ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు ఇవ్వడానికి కోట్లు వెచ్చించి అడవిపల్లె రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్‌కు ఇరుపక్కలే కొండలే ఆధారంగా ఉన్నాయి. అయితే తీతవగుంటపల్లె వైపు క్వారీ నిర్వాహకులు కొండను పిండి చేస్తుండడంతో రిజర్వాయర్‌కు ప్రమాదం తప్పదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ప్రవీణ్‌కుమార్, తీతవగుంటపల్లె

వరదనీటి సమస్యను పరిష్కరిస్తాం



వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఆర్అండ్‌బీ బంగ్లా వెనుకవైపు గల ఇండ్లచుట్టూ చెయ్యేరు నుంచి కన్యకాచెరువుకు కయ్యం కాలువ ద్వారా ఇటీవల కురిసిన వర్షానికి వరదనీరు ఇళ్లను చుట్టుముట్టింది. ప్రజలు జల దిగ్బంధంలో ఇరుకున్నారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి శుక్రవారం ఉదయం బాధితుల ఇళ్లవద్దకు వెళ్లి పరామర్శించి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెయ్యేరు నుంచి కన్యకా చెరువుకు నీరు అందించే ప్రధాన కాలువ పలుచోట్ల లీకేజికి గురి కావడంవల్ల ఆ నీరు ఇండ్ల చుట్టూ చేరి ప్రజలను భయాందోళనకు గురైన విషయం తమ దృష్టికి తేవడం జరిగిందన్నారు. సమస్యను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవికి ఫోన్ ద్వారా వివరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ స్థానిక తహసీల్దార్ అమర్నాథ్‌ను బాధిత కుటుంబాల వద్దకు పంపించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించాలని కన్యకా చెరువునీటి సంఘం అధ్యక్షులు భూశెట్టి వెంకటసుబ్బయ్యను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, ఉప సర్పంచ్ ఇబు, వైఎస్సార్ సీపీ నాయకులు గుండు మల్లికార్జున రెడ్డి, నడివీధి సుధాకర్, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, హస్తవరం సుబ్బరామిరెడ్డి, అరిగె హరిబాబు, ఆనాల మధ యాదవ్, అజీజ్, సుభాన్, నవాబ్, కరిముల్లా, అన్సార్ బాష, మహబూబ్ బాషా, ముమ్మడి శెట్టి సుధాకర్, పుత్తా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న షంషాద్ కుటుంబీకులు

రాయచోటి అర్బన్ : గాలివీడు గ్రామానికి చెందిన వృద్ధురాలు షంషాద్ భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పోరెడ్డి రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాలివీడు రెవెన్యూ అధికారుల అలసత్వ వైఖరిని ఖండిస్తూ ఆయన శుక్రవారం బాధితురాలు షంషాద్, ఆమె కుటుంబీకులతో కలసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గాలివీడులో డీకేటీ భూమిని ప్రభుత్వం షంషాద్ భర్త హుస్సేన్ సాహెబ్ పేరుమీద మంజూరు చేసింది. హుస్సేన్ సాహెబ్ మరణాంతరం షంషాద్ సదరు భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తోందన్నారు. కాగా అదేగ్రామానికి చెందిన శనగకాయల మిల్లుల యజమానాలు షేక్ అహమ్మద్ బాషా, జిలానీ బాషా భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారన్నారు. 2022లో అప్పటి జిల్లా ఉన్నతాధికారుల జోక్యం కారణంగా కబ్జాదారులు కొద్దిరోజులు మిన్నకుండి పోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కబ్జాదారులు తప్పుడు డాక్యుమెంట్లు పాసు బుక్కులు తయారు చేసుకుని తిరిగి భూ ఆక్రమణకు ప్రయత్నిస్తూ వృద్ధురాలు షంషాద్‌ను తీవ్రస్థాయిలో బెదిరిస్తున్నారంటూ ఆరోపించారు. భూకబ్జాకు ప్రయత్నిస్తున్న వారిని, వారికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

పెండింగ్ నిధులను విడుదల చేయాలని బైఠాయింపు



జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్నటువంటి రూ. ఫీజురియింబర్స్‌మెంట్, వసతిదీవెన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. నేతాజి సర్కిల్‌లో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజురియింబర్స్‌మెంట్ కింద రూ. 3,580 కోట్లు, వసతి దీవెన కింద రూ.1480 కోట్ల నిధుల విడుదలలో చూపుతున్న నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి పైపథకాల నిధులు విద్యాసంస్థల ఖాతాలలోకి చేరలేదనే కారణంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్‌బాబు హామీ ఇచ్చిన విధంగా జిఓ నం.77ను వెంటనే రద్దు చేయాలన్నారు. పాలకులు స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమించనున్న ట్లు వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, మాధవ్, జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్, గర్ల్స్‌కో కన్వీనర్ భవిత, రాయచోటి నేతలు కార్తీక్, లోకేష్, గణేష్‌తో పాటు పెద్ద త్తున విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి

రాయచోటి అర్బన్ : కార్మిక సమస్యల పరిష్కారంలో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ,రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక సమస్యల పరిష్కారంలో దారుణంగా వైఫల్యం చెందాయన్నారు. సంపదను సృష్టిస్తున్న కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఎన్నో త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి తీరని అన్యాయం చేస్తున్నారంటూ మండిపడ్డారు. జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, కార్మికుల వలసలు నివారించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 16,17 తేదీలలో రైల్వేకోడూరులో జిల్లా ద్వితీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పియల్ నరసింహులు, కార్యదర్శి గంగాధర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరమ్మ, సరోజమ్మ, భవన నిర్మాణ సంఘం నేతలు వేణు గోపాల్‌రెడ్డి, సలీంబాష, బత్తల రమణయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో ఐదుగురు స్మగ్లర్లు అరెస్టు

- 15 ఎర్రచందనం దుంగలు పట్టివేత
- రెండు బైకులు స్వాధీనం



ఎర్రచందనం స్మగర్ల అరెస్టు చూపుతున్న డీఎస్పీ సుధాకర్

రాజంపేట : పుల్లంపేట పోలీసుస్టేషన్ పరిధిలో అనంతసముద్రం పంచాయతీ బోటుమీదపల్లెకు చెందిన ఐదుమంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశామని రాజంపేట డీఎస్పీ సుధాకర్ తెలిపారు. శుక్రవారం రూరల్ సీఐ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో బోటుమీదపల్లె గ్రామానికి ఉత్తరంవైపు ఉన్న ఊరుగట్టు వద్ద సాలన గంగయ్య(బోటుమీదపల్లె), అక్కని నరసింహులు(బోటుమీదపల్లె), బొర్సు సుబ్బరాయుడు(బోయనపల్లె, రాజంపేట), చల్లా వెంకటస్వామి(కడప, శ్రీరాంనగర్), నక్క చిన్న వెంకటసుబ్బయ్య(నాగసానిపల్లె, ఖాజీపేట మండలం) ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.4,31,200 విలువ చేసే 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.80వేలు విలువ చేసే రెండు బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టుకు హాజరపరచగా రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు. స్మగ్లర్లను పట్టుకోవడంలో రూరల్ సీఐ బీవీరమణ, పుల్లంపేట, నందలూరు ఎస్ఐలు, రెడ్‌శాండల్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాజ్‌కుమార్ వారి సిబ్బంది, ఎఫ్‌బీఓలు ప్రధాన పాత్ర పోషించారన్నారు.

చిరుతపులి దాడిలో మేక మృతి



మృతిచెందిన మేక

ములకలచెరువు : చిరుతపులి దాడిలో మేక మృతిచెందిన సంఘటన గురువారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. మేకల కాపరి పి. నరసింహులు కథనం మేరకు... మండలంలోని పెద్దపాళ్యంకు చెందిన పి. నరసింహులకు వంద వరకు మేకలు ఉన్నాయి. వీటిని ప్రతి రోజూ స్థానికంగా ఉన్న కనుగొండ అడవిలోకి మేపేందుకు తోలుకొని వెళ్తుంటాడు. గురువారం సాయంత్రం మేకలను ఇంటికి తోలుకొని వస్తుండగా చిరుతపులి ఒక మేకపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిందన్నాడు. తనతో ఉన్న కుక్కలు, అతను ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పులి వెళ్లిపోయినట్లు చెప్పాడు. భయభ్రాంతులకు గురైన కాపరి గ్రామంలోని పలువురికి ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నట్లు చెప్పాడు. అప్పటికే చిరుత పులి అక్కడినుంచి నిష్క్రమించినట్లు చెప్పారు. పులి దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన మేకను అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. ఘటనపై అధికారులకు వివరించామన్నారు. అటవీశాఖ సెక్షన్ అధికారి షబీన్ తన సిబ్బందితో పెద్దపాళ్యం చేరుకొని విచారించారు. కనుగొండ అడవిలో చిరుతపులులు ఉన్నాయన్నారు. గతంలో అడవిలోని కోతులు, జింకలను తిన్నట్లు తెలిసిందన్నారు. పులి కాలి ముద్రలు సైతం గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన అధికారులు గుర్తించారని చెప్పారు.

అన్నమయ్య ఇంటిని పునఃనిర్మించాలి

లక్కిరెడ్డిపల్లి : తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో గతంలో కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని పునఃనిర్మించి, అన్నమయ్య విగ్రహం, హనుమంతుని విగ్రహం ఏర్పాటు చేయాలని జిల్లా నాయకులు రంగస్థల కళాకారుడు తుమ్మల హరినాథ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని శ్రీకృష్ణదేవాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తిరుమలలో నిత్యం జరుగుతున్న హరినామ సంకీర్తనలకు అనుమతి వచ్చిందన్నారు.అలాగే రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలోనూ, తిరుపతిలోని ప్రముఖ అనుబంధ దేవాలయాలలో కూడా అఖండ హరినామ సంకీర్తనలు గానం చేసే విధంగా భజన బృందాలకు అనుమతి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ దేవాలయాలలో భజనం చేసిన బృందాలకు రానుపోను చార్జీలు అందించాలని, వసతిని కల్పించాలని, భజన నేర్పే గురువులకు ప్రతినెలా గౌరవ వేతనం రూ. 10 వేలు ఇవ్వాలని కోరారు. ఈనెల 24న నిర్వహించే టీటీడీ పాలక మండలి సమావేశంలో టీటీడీ చైర్మన్, ఈఓ, పాలక పెద్దలు పెద్దమనస్సు చేసుకొని భజనలు చేయుటకు అనుమతి ఇచ్చి కళాకారులకు తగిన న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో కళాకారాలు, హార్మోనిస్టు మహదేవ, బాబు, భజన గురువులు ఆదినారాయణ, రామానుజులు, భాస్కర్, జలంధర్, నారాయణమ్మ, చంద్రకళ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో చోరీ చేసిన నిందితులను ఎస్ఐ నవీన్ బాబు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనం చేసిన నిందితులు బాలిరెడ్డిపల్లికి చెందిన కొమ్మలపాటి గోవర్ధన్, మల్లిబోయిన శివకుమార్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 66,132లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితుడు కొమ్మలపాటి గోవర్ధన్‌పై గతంలో చోరీ కేసులు నమోదైనట్లు తెలిపారు.

కేరళ ట్రెక్కింగ్‌కు ఎన్‌సీసీ విద్యార్థి



దిలీప్ కుమార్

చిట్వేలి : ఆల్ ఇండియా కేరళ ట్రెక్కింగ్‌కు చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ విద్యార్థి పులి దిలీప్ కుమార్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఏబీఎన్ ప్రసాద్, ఎన్‌సీసీ ట్రూప్ అధికారి పసుపుల రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి 28వ తేది వరకు కెడెట్ దిలీప్ కుమార్ జాతీయస్థాయిలో కేరళలో జరిగే ట్రెక్కింగ్‌లో పాల్గొంటారన్నారు. జాతీయస్థాయి శిబిరానికి ఎంపిక కావడంపట్ల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

శిక్షణలో నేర్చుకున్న విషయాలను అమలు చేయండి



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న విషయాలపై తరగతి గదిలో అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం రాయచోటి – గాలివీడు రోడ్డులోని అర్చనా విద్యాసంస్థలలో పునాదిస్థాయి అక్షరాస్యత, సంఖ్యా/జ్ఞానంపై ఉపాధ్యాయులకు ఆరు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఈ శిక్షణ కేంద్రాన్ని డిప్యూటీ ఈవో శివప్రకాష్‌రెడ్డి, స్టేట్ అబ్జర్వర్ ఎస్‌సీఈఆర్‌టీ అధికారి డాక్టర్ రోషిణిలతో కలసి డీఈఓ తనిఖీ నిర్వహించారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతి విషయాన్ని పాఠశాలలోని తరగతి గదిలో అమలు పరిచి విద్యార్థులకు నేర్పాలని చెప్పారు. విద్యార్థులలో లెర్నింగ్ అవుట్ కమ్స్ మెరుగుపరుచుకోవడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

గుంతకల్ డివిజన్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడిగా బీఎం బాషా



బీఎం బాషా


రాజంపేట : గుంతకల్ రైల్వే డివిజన్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడిగా నందలూరు రైల్వేకేంద్రానికి చెందిన రచయిత, నంది అవార్డు గ్రహీత బద్వేలు మస్తాన్‌బాషా(బీఎంబాష) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం దక్షిణ మధ్యరైల్వే జోనల్ మజ్దూర్ యూనియన్ నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఇప్పటివరకు డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న కెఎస్ రాజు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో బీఎం బాషా నియమితులయ్యారు.1997లో ఆర్ఆర్‌బీ ద్వారా ఎఎల్‌పీగా చేరారు. ప్రస్తుతం ఈయన రేణిగుంట జంక్షన్‌లో లోకో పైలెట్‌గా పనిచేస్తున్నారు. నందలూరు రైల్వేకేంద్రంలోనే విద్యాభాస్యంతో పాటు రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే ఇన్సిట్యూట్ సెక్రటరీగా కార్మికులకు అనేక సేవలందించారు. ఈయన డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నిక పట్ల నందలూరు మజ్దూర్ యూనియన్ నేతలు గోపి, విశ్వనాథ్‌లతో పాటు పలువురు యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన నిర్మాణ భవనంలో కరెంటు దొంగలు

–రూ.7లక్షల విలువ చేసే కరెంట్ సామగ్రి చోరీ

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయరహదారి రాజంపేట మండల గుండ్లూరు శివాలయం క్రాస్‌లో నందలూరు జెడ్పీటీసీ గడికోట ఉషా సుబ్బారెడ్డి నిర్మిస్తున్న నూతన కళ్యాణ మండపం, లాడ్జిలలో రూ.7లక్షలకు పైగా విలువ చేసే కరెంట్ సామగ్రిని దొంగలు దోచుకెళ్లారు. ఒక ముఠాగా ఏర్పడి రోజు రాత్రులలో మూడురోజులపాటు కరెంటు సామగ్రి తీసుకొనివెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున కరెంటు సామగ్రిని పూర్తిస్థాయిలో తొలిగించే పనిలో ఉండగా జెడ్పీటీసీ డ్రైవరు, వాచ్‌మెన్ పసిగట్టి వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఒంటిమిట్ట మండలం కొత్తపల్లెకు చెందిన మధు అనే వ్యక్తి దొరికారు. అక్కడే స్కూటీను పట్టుకున్నారు. ఇద్దరు దొంగలు గోడ దూకి పారిపోయారు. మన్నూరు పోలీసులు సమాచారం అందుకున్న సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాగా స్కూటీ ఆర్‌సీ పరిశీలన చేసే మన్నూరుకు చెందిన దిల్షాద్ పేరుతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు ఈ చోరీపై విచారణ చేస్తున్నారు.

విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతి



గాలివీడు : విద్యుత్ తీగలు తగిలి పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలకేంద్రంలోని చోటు చేసుకుంది. పెద్దూరుకు చెందిన రియాజ్ అహమ్మద్‌కు చెందిన పాడి ఆవు శుక్రవారం మేతకు వెళ్లిన క్రమంలో పెద్దూరు పక్కనే వరిమళ్ళలో ఉరుసు జరిగే ప్రాంతంలో 11 కేవీ విద్యుత్ తీగలు డిస్క్ కట్ అయిన కారణంగా కిందకు వేలాడుతున్నాయి. ప్రమాదవశాత్తు పాడి ఆవుకు తీగ తగిలి మృతి చెందినట్లు సమాచారం. మరో 20 రోజుల్లో పాడి ఆవు ప్రసవించాల్సి ఉండగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ తీగల ధాటికి పాడి ఆవు విగత జీవులై పడివుండటం చూపరుల హృదయాన్ని కలిచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.